భారంగా ఇళ్ల నిర్మాణం

- పెరిగిన ధరలతో సామాన్యుడు కుదేలు
- సిమెంట్, ఐరన్ ధరలకు రెక్కలు
- ఇసుక, కంకర రేట్లు రెట్టింపు


బూర్గంపాడులో నిర్మిస్తున్న ఇల్లు

బూర్గంపాడు: సామాన్యుడి సొంతింటి కల కల్లలవుతోంది. పెరిగిన నిర్మాణవ్యయంతో సామాన్యుడు ఇల్లు కట్టుకునే పరిస్థితులు లేవు. రోజురోజుకూ నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోతున్నాయి. ఒక బడ్జెట్‌లో ఇల్లు కట్టుకుందామనుకుంటే ఇంటి నిర్మాణం పూర్తి చేసేసరికి బడ్జెట్ రెట్టింపవుతుంది. దీంతో ఇంటి నిర్మాణాలతో పలువురు అప్పులపాలవుతున్నారు. అప్పు పుట్టనివారు మధ్యలోనే నిర్మాణాలను అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారు.

ఇళ్లులేని పేద, మధ్యతరగతి ప్రజలు ఏళ్ల తరబడి ప్రభుత్వ పక్కా గృహాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాల మంజూరులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. దీంతో వాటిపై ఆశలు వదులుకున్న సామాన్యులు సొంతంగా రెండుగదుల ఇళ్ల నిర్మాణాలపై దృష్టిపెట్టారు. అయితే ఇంటి నిర్మాణాలకు అవసరమైన ఇనుము, సిమెంట్, కంకర, ఇసుక, ఇటుకల ధరలు రోజురోజుకు పెరుగుతుండటం సామాన్యప్రజలకు భారంగా మారింది. దీంతో కొందరు ఇళ్ల నిర్మాణాలకు అధిక వడ్డీలకు అప్పులు చేస్తున్నారు. కొందరు మధ్యలోనే ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేస్తున్నారు.

ధరలు ఇలా..

రెండేళ్ల క్రితం రూ.250 ఉన్న సిమెంట్ బస్తా ధర ప్రస్తుతం రూ.350 దాటింది. దీంతో ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు అదనపు భారం పడుతోంది. టన్ను ఇనుము గతంలో రూ.50 వేల నుంచి రూ.55వేల వరకు ఉంది. ప్రస్తుతం అది రూ.65 వేల నుంచి రూ.75 వేలకు పైగానే పలుకుతుంది. ట్రక్కు కంకర ధర రూ.2000 నుంచి ధర రూ.3200కు చేరింది. ఇటుకల ధరలదీ అదేపరిస్థితి. డిమాండ్‌ను బట్టి ఇంటి నిర్మాణ సామగ్రి ధరలను పెంచేస్తున్నారు.

గోదావరి, కిన్నెరసాని నదులు చెంతనే ఉన్నప్పటికీ ఇసుక ధరలు మాత్రం చుక్కల్లోనే ఉన్నాయి. ఒక ట్రక్కు ఇసుకధర రూ.3 వేలు పలుకుతుంది. గోదావరి, కిన్నెరసాని నుంచి అక్రమంగా ఇసుకను తరలించి కొందరు భారీగా సొమ్ముచేసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో సామాన్యుడు ఇంటి నిర్మాణం కలగానే మిగులుతోంది. ప్రభుత్వం ధరలను నియంత్రించాలని, సామాన్యుడి కలను సాకారం చేయాలని పలువురు కోరుతున్నారు.

బస్తాకు రూ.100 పెరిగింది

ఆరు నెలల క్రితం ఇల్లు మొదలుపెట్టినప్పుడు రూ.280కి సిమెంట్ బస్తా కొన్నాను. ఇప్పుడు సిమెంట్ బస్తా రూ.350కు పెరిగింది. రూ.2,300కు వచ్చిన కంకర ధర రూ.3వేలకు పైగానూ పడుతుంది. మూడునెలల్లోనే 20శాతం మేరా రేట్లు పెరిగాయి.

– బి.వెంకన్న, ఎంపీ బంజర

హైదరాబాద్ ధరలు ఇక్కడ..

గోదావరి, కిన్నెరసానిలు పక్కనే ఉన్నప్పటికీ ఇసుక ధరలు ఎక్కువగా ఉండడంతో కొనుక్కోలేకపోతున్నాం. హైదరాబాద్‌లో పలికే ధరలు ఇక్కడ పలుకుతున్నాయి. కంకర, ఇనుము, సిమెంట్ ధరలు పెరిగాయి. పేదలు ఇల్లు కట్టుకునే పరిస్థితులు లేవు. ధప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– షేక్ చాంద్‌పాషా, బూర్గంపాడు

క్లుప్తంగా

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

అశ్వారావుపేటరూరల్: అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మడకం ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలోని కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం రోజులు గడుస్తున్నా కొనకుండా తాత్సరం చేస్తోందన్నారు. దీంతో రైతులు ఆరబోసిన ధాన్యం వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని, తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సంఘం దుర్గారావు, జక్కుల చిన్ని, రైతులు పాల్గొన్నారు.

స్వర్ణ నేత్రాలు బహూకరణ


ఆలయ కమిటీకి స్వర్ణ నేత్రాలను అందజేస్తున్న రిటైర్డ్ ఎస్సై దంపతులు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని నడికుడి గ్రామంలోని మహంకాళీ చాముండేశ్వరి అమ్మవారికి ఆదివారం స్వర్ణ నేత్రాలను భక్తులు బహూకరించారు. భద్రాచలం పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై మల్లుల వెంకటరామారావు, చంద్రకళ దంపతులు అమ్మవారిని దర్శించుకుని స్వర్ణ నేత్రాలతో పాటు కల్యాణ బొట్టు, చీరను ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులకు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు యశ్వంత్ శర్మ, అప్క శంకర్, రత్తమయ్య, రాముడు, వెంకటరమణ, తిరుపతిరావు, కోటేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సత్యవతి

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యాన ఈ నెల 27న నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి పిలుపునిచ్చారు. భద్రాచలం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అవినీతి, లీకేజీ, లిక్కర్ మాఫీయా, కుటుంబ పాలనను అంతమొందించడం కోసం నిరుద్యోగులు, విద్యార్థులు, యువతి, యువకులు, బీజేపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో కదిలిరావాలని కోరారు. సమావేశంలో క్రాంతికుమార్, రామ్మోహన్‌రావు, చక్రవర్తి, వెంకన్న, శేషగిరిరావు, కేశవ్, శ్రీను, జయరాజు, క్రాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

గుండాల: గుండాల మండలానికి చెందిన అయిత నాగభవ్యశ్రీ ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 467 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో సెకండ్ ర్యాంకు, జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినందుకు ఆదివారం నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య తారక్ ప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించి మండలానికి, తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు ఆదిలక్ష్మి, శ్రీశైలం, అమ్మమ్మ తాటిపల్లి కళావతి, కొంతం రాములు, తవిడిశెట్టి రాంబాబు, నాగ మల్లయ్య పాల్గొన్నారు.

బస్‌పాసుల పంపిణీ

మణుగూరురూరల్: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఆర్టీసీ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పాకాల రమాదేవి ఆదివారం దివ్యాంగులకు బస్‌పాసులు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వ విప్ రేగా సూచనలతో దివ్యాంగుల తరుపున 50శాతం నగదు చెల్లించి బస్ పాసులు ఇప్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రకళ, తోట వీరస్వామి, ఆర్టీసి సిబ్బంది ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

కుడుములపాడులో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని కుడుములపాడు గిరిజన గ్రామంలో ఆదివారం వైద్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ నెల 21వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'కుడుములపాడులో వైరల్ జ్వరాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనంపై వైద్య శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పీహెచ్‌సీ వైద్యులు రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 21 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, జ్వరాలతో బాధ పడుతున్న వారికి వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం గృహాలను సందర్శించి, ఇళ్ల పరిసరాలను పరిశీలించారు. దోమల నివారణకు సూచనలు చేశారు. అలాగే గ్రామస్తులకు దోమలు నివారణ, జ్వరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. గ్రామంలో జ్వరాలు అదుపులో ఉన్నాయని, డెంగీ జ్వరాలు కాదని తెలిపారు. గ్రామస్తులు భయందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, రాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యులు

పొంగులేటి విస్తృత పర్యటన

బూర్గంపాడు: ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం బూర్గంపాడు మండలంలో విస్తృతంగా పర్యటించారు. సారపాకలోని ముత్యాలమ్మపేటలో ముత్యాలమ్మతల్లి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం గాంధీనగర్, రాజీవ్‌నగర్‌లలోని వివాహ కార్యక్రమాల్లో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో సొసైటీ మాజీ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి ఇంట్లో శుభకార్యానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. లక్ష్మీపురంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రామ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సత్యావతి దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మిని అభినందించారు. లక్ష్మీపురం గ్రామంలో పోతిరెడ్డి రమణారెడ్డి, నాగలక్ష్మి దంపతుల కుమార్తెలు సాత్విక, కీర్తనలను ఆశీర్వాదించారు. అయా కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, లక్ష్మీపురం ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, యడమకంటి రోశిరెడ్డి, కాటం వెంకట్రామిరెడ్డి, గుజ్జు క్రాంతిరెడ్డి, ప్రశాంత్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు: రాజ్యలక్ష్మిని అభినందిస్తున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జర్నలిస్టుకు పరామర్శ

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో సీనియర్ జర్నలిస్ట్ తూము సత్యం కుటుంబాన్ని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్న సత్యం కుమారుడు రితీష్ నివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వారి వెంట పీఏసీఎస్ చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మూలనపడ్డ 'చెత్త' రిక్షాలు



పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకు అందించిన స్వచ్ఛ రిక్షాలు మూలనపడ్డాయి. దాంతో చెత్త సేకరణ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి గతంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా స్వచ్ఛ భారత్ కింద మూడు చక్రాల రిక్షాలను అందించింది. వీటిలో రెండు రిక్షాలను మేజర్ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాల ఎదురుగా ఉన్న చెత్త కుప్ప వద్ద ఉంచారు. కొంత కాలంగా వీటి నిర్వహణ, పర్యవేక్షణ లేక చెత్త కుప్ప దగ్గరే వృథాగా పడి ఉన్నాయి. చిన్న చిన్న రిప్లేర్లు చేస్తే వాటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావచ్చు. కానీ ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: హరికృష్ణ, మేజర్ పంచాయతీ ఈఓ
ఫోన్ నంబర్: 9491638720

ముమ్మరంగా తనిఖీలు

చర్ల: మండల కేంద్రం జరిగే ఆదివారం వారపు సంత నేపథ్యంలో చర్లతోపాటు రూరల్ గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. లెనిన్‌కాలనీ, లక్ష్మీకాలనీ, పెట్రోల్ బంక్, పాతచర్ల, గాంధీ సెంటర్‌లలో సీఆర్పీఎఫ్, స్పెషల్‌పార్టీ, సివిల్ పోలీసులు మోహరించి వచ్చేపోయే వారిని నిశితంగా పరిశీలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని నిర్ధారించిన తరువాత విడిపెట్టారు.

రేపు సంత వేలం పాట

దమ్మపేట: దమ్మపేట వారపు సంతకు సంబంధించి బహిరంగ వేలాన్ని సర్పంచ్ ఉయ్యాల చినవెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసినట్లు ఎంపీఓ రామారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో సరైన ధర రాకుంటే వేలాన్ని రద్దు చేసే అధికారం పంచాయతీకి ఉందని తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

భద్రాచలంటౌన్: లయన్స్ క్లబ్ భద్రాచలం నూతన అధ్యక్షుడిగా భీమవరపు వెంకటరెడ్డిని కార్యదర్శిగా గుండు శరత్, కోశాధికారిగా జి.భరత్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడిగా భోగాల శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ, సురేష్‌కుమార్, పీఆర్‌ఓగా రంగారెడ్డి, జాయింట్ సెక్రటరీగా వెంకటేశ్వరరావు, సూర్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. సామాజికంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందలు ఉన్నా అండగా ఉంటామని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు

భద్రాచలంటౌన్: దళితులు కలిసి ఉంటేనే ముద్దని, ఎస్సీ వర్గీకరణ వద్దని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో ఆదివారం జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. దళితులు ఐక్యంగా ఉండి 2024లో రాజ్యాధికారం సాధించుకోవాలని అన్నారు. కొందరు వర్గీకరణ పేరుతో కోట్లు సంపాదించాలరని ఆరోపించారు. రవి, వెంకటేశ్వరరావు, పాపయ్య, సుధాకర్, నరసింహారావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వారావుపేటరూరల్: రహదారి ప్రమాదంలో గాయపడి, ఇంటికే పరిమితమైన ఓ స్నేహితుడికి ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. మండల కేంద్రంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన నిమ్మకాయల వెంకటరమణ రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. మరో శస్త్ర చికిత్స చేయాల్సి ఉండటంతో 2003 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, స్నేహితులంతా కలిసి రూ.14వేలను అందించారు. కార్యక్రమంలో దేరంగుల శ్రీను, జల్లిపల్లి గుప్తా, పిల్లి శ్రీకాంత్, పసుపులేటి మహేష్ ఉన్నారు.

మహిళకు వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన నిరుపేద గిరిజన మహిళకు భద్రాద్రి బ్రహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వితరణ అందజేశారు. గోదావరి నది స్నాన ఘట్టాల వద్ద చిరు వ్యాపారం చేస్తూ కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న మడకం లక్ష్మికి నిత్యవసర వస్తువులు, ఆర్థిక సహాయం అందజేశారు. రవికుమార్ శర్మ, ఆర్‌వీ శ్రీనివాస్ శర్మ, సత్య ప్రసాద్ శర్మ, కేదార్‌నాథ్, రాంబాబు, కేశవాచారి, కల్యాణ్‌రామ్ పాల్గొన్నారు.

పర్యావరణ హితంపై అవగాహన సదస్సు

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం కార్యాలయంలో ఆదివారం పర్యావరణ హిత జీవనశైలిపై ఏరియాలోని గనులు, డిపార్ట్‌మెంట్ల అధిపతులకు, అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏరియా జీఎం దుర్గం రామచందర్ హాజరై మాట్లాడారు. పర్యావరణ హితం కోసం ప్రజలు తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ అధికారి జె శ్రీనివాసరావు మిషన్ లైఫ్ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్, ప్రాజెక్ట్ అధికారులు నాగేశ్వరరావు, శ్రీనివాసచారి, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్లు, ప్రాజెక్ట్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏరియా జీఎం దుర్గం రామచందర్

జలగం వర్గీయుల సమావేశం

దమ్మపేట: రాజకీయాలపై మాట్లాడానికి ఇంకా సమయం ఉందని, రానున్న రోజుల్లో రాజకీయ భవిష్యత్తును ప్రకటిస్తానని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అన్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు వర్గీయులు, ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామ శివారులో ఉన్న పామాయిల్ క్షేత్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జలగం వెంకట్రావు హాజరయ్యారు. ముందుగా ఆర్లపెంట గ్రామ శివారులోని గండి ముత్యాలమ్మ ఆలయం వద్ద జలగంకు ఆయన వర్గీయులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో జలగం పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గముల నుంచి ఆయన అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో జలగం మాట్లాడుతూ.. కొత్తగూడెం నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటానని పేర్కొన్నారు. విలేకర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా.. రాజకీయ వ్యాఖ్యలకు ఇంకా సమయం రాలేదని, జూలై నెలలో భవిష్యత్తు రాజకీయాలపై మాట్లాడుతానని తెలిపారు. గత కొద్దిరోజులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జలగం చేస్తున్న పర్యటనలపై ప్రజల్లో చర్చ మొదలైంది. గతంలో జలగం ఎమ్మెల్యేగా పోటీ చేసింది కొత్తగూడెం నియోజకవర్గం నుంచి అయినప్పటికీ, ఆయన పర్యటనలకు రాజకీయ ప్రాధాన్యత ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలతో పాటుగా ప్రధాన అనుచరులు చెలికాని సూర్యారావు, జనార్ధనరెడ్డి, బాణోత్ కేస్లీ, పూచి యశోద, మాగ్గళ్ల ప్రసాద్, చింతలపాటి సత్యనారాయణ, గాదె సీతారాం, కోటగిరి రామక్రుష్ణ, మాధవరెడ్డి కృష్ణారావు, రావుల శ్రీను, చినశెట్టి సత్యనారాయణ, జలగం వాసు పాల్గొన్నారు.


తన వర్గీయులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు

చేతిరాతతో ఉన్నత భవిష్యత్


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

మణుగూరురూరల్: విద్యార్థుల ఉన్నతికి అందమైన చేతిరాత ఎంతగానో దోహదపడుతుందని భరోసా వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు ఎం.లింగబాబు తెలిపారు. పీవీకాలనీ సీఈఆర్ క్లబ్‌లో భరోసా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత హ్యాండ్ రైటింగ్ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భరోసా వెల్ఫేర్ సొసైటీ వారి సామాజిక సేవా కార్యక్రమాలను కూనవరం సర్పంచ్ ఏనిక ప్రసాద్ అభినందించారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, స్టడీమెటీరియల్ అందజేశారు. హ్యాండ్ రైటింగ్ శిక్షకుడు షేక్ మహబూబ్ హుస్సేన్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికతతో సత్కరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు అమీనుద్దీన్, స్వరూపారాణి, శశికిరణ్, జహీర్‌ఖాన్, దీపక్, విల్సన్ రాజ్, ముజఫర్, జయకర్, యాకుబ్‌పాషా, కరుణాకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మణుగూరురూరల్: మణుగూరులోని శ్రీవాణి నికేతన్–2003 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వపు విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి పాఠశాల గురువులు వాసు, వాణి, కమలాకర్, శ్రీరాములు, మహ్మద్, అన్నపూర్ణ, పద్మావతిలను పూర్వపు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాలతో, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సరదగా గడపడంతో పాటు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి పూర్వపు విద్యార్థులు మధుసూధన్, శ్రీను, స్వాతి, హరితలు నేతృత్వం వహించగా.. 2003 పదో తరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దేశాన్ని ప్రగతి బాటలో నడిపి, ఐటీ రంగం అభివృద్ధికి కృషి చేసిన ఘనుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశానికి ఆయన మార్గదర్శిగా అభివర్ణించారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చర్ల: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


దమ్మపేటలో..


చంద్రుగొండ: పేదలకు పండ్లు పంపిణీ చేస్తూ..


భద్రాచలంటౌన్: కాంగ్రెస్ నాయకుల నివాళులు..


అశ్వారావుపేటరూరల్: పూలతో నివాళి..